మనం
హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్
శనివారం | 21 | మార్చి | 2026 పేజీలు: 5


# మూసి సుందరీకరణకు భారీగా నిధులు

మూసి ప్రక్షాళనకు బడ్జెట్‌లో ప్రాధాన్యత

కాలుష్యాన్ని అరికట్టేందుకు వేగంగా చర్యలు

లండన్ థేమ్స్ నది తరహాలో మూసీ తీరాం



హైదరాబాద్,మార్చి20(మనం న్యూస్): తెలంగాణ బడ్జెట్ లో మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 1,500 కోట్లను కేటాయించింది. డిప్యూటీ సీఎం , ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ బడ్జెట్‌ను అసెంబ్లీ లో ప్రకటించారు. హైదరాబాద్ రూపురేఖలను మార్చే ప్రాజెక్టుగా ఇప్పటికే ప్రభుత్వం స్పష్టంచేసింది. ఈ మేరకు బడ్జెట్‌లో ప్రాధాన్యత నిచ్చింది. లండన్ థేమ్స్ నది తరహాలో మూసీ తీరాన్ని అభివృద్ధి చేసే దిశగా కేటాయింపులు జరిపింది.

### నిధులతో:

ఈ నిధులను మూసీ నది ప్రక్షాళన, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు, నది పొడవునా పచ్చదనం పెంచే పనులకు

-మిగతా 2లో

## నగర ఉద్యోగులకు... తీపి కబురు..

50 శాతం వరకు హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర సర్కారు.



2

## ఓయుకు.. పెద్ద పీట

బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు.

మాట నిలపుకున్నా ముఖ్యమంత్రి..

ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా మరానున్న ఓయు



హైదరాబాద్,మార్చి20(మనం న్యూస్): తెలంగాణ విద్యార్థి ఉద్యమాలకు గుండెకాయ ఉస్మానియాకు రాష్ట్ర బడ్జెట్‌లో రేవంత్ సర్కారు పెద్ద పీట వేసింది. వర్సిటి అభివృద్ధికి రూ.1000 కోట్ల నిదులను సర్కారు కేటాయించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లోగడ ఓయు విద్యార్థులకు ఇచ్చిన మాటను నిలపుకున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిన సమయంలో ఓయు విద్యార్దులు ఉద్యామాన్ని ముందుండి నడిపిన విషయం తెలిసిందే. రాష్ట్రా అవిర్భావం తరువాతగత ప్రభుత్వం విశ్వవిద్యాలయాన్ని పట్టించుకోలేదు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి తొలి నుంచి ఓయూ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఓయూకు సైతం ఆయన వెళ్లారు. విద్యార్థులతో భేటీ అయ్యారు. వారి సమస్యలను పరిష్కరించారు. నిరుద్యోగ సమస్యకు కూడా నోటిఫికేషన్‌ల ద్వారా పరిష్కరించారు. తాజాగా యూనివర్సిటీ అభివృద్ధిపై

-మిగతా 2లో



2

## నిలిచిపోయిన.. మెట్రో

తీవ్ర ఇబ్బందుల్లో ప్రయాణికులు

కష్టతరంగా మారిన ప్రయాణం

అసహనం వ్యక్తం చేసిన ప్రయాణికులు



# మూసి సుందరీకరణకు భారీగా నిధులు

మొదటి పేజీ తరువాయి

వినియోగించనున్నట్లు తెలుస్తోంది. ప్రాజెక్టు తొలి దశలో భాగంగా సుమారు 55 కిలోమీటర్ల మేర నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా చెక్ డ్యామ్‌ల నిర్మాణం, రివర్ వాక్-వేలు, సైక్లింగ్ ట్రాక్‌లు, పర్యాటకుల కోసం ప్రత్యేక వినోద ప్రాంతాలను ఏర్పాటు చేయనుంది.

**కీలకం కానున్న ప్రాజెక్టు:**

మరోవైపు నగరంలో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు మూసీ పరిసర ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు ఈ ప్రాజెక్టును కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి సామాజిక-ఆర్థిక సర్వేలు పూర్తి చేసింది. నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూనే పనులు వేగంగా చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే బడ్జెట్లో రూ. 1,500 కోట్లు కేటాయించింది. ఈ మేరకు ప్రాజెక్టు ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనకు, భూసేకరణకు సంబంధించి అత్యవసర పనులకు ఈ నిధులను ప్రభుత్వం ఉపయోగించనుంది..

# ఓయుకు.. పెద్ద పీట

మొదటి పేజీ తరువాయి

ఫోకస్ పెట్టిన ఆయన బడ్జెట్లో రూ. 1000 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. ఈ మేరకు బడ్జెట్‌లో వర్సిటీకి కేటాయింపులు జరిపారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు చేశారని పలువురు కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఓయూని తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపేందుకే భారీగా నిధులను మంజూరు చేసిందని చెబుతున్నారు.

**వర్సిటీ అభివృద్ధికి రూ.1000 కోట్లు:**

కాగా బడ్జెట్‌లో కేటాయించిన రూ. 1,000 కోట్లను వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పన, పాత భవనాల పునరుద్ధరణ, నూతన హాస్టల్ భవనాల నిర్మాణానికి వినియోగించనున్నారు. ఈ కేటాయింపులతో యూనివర్సిటీలో అత్యాధునిక పరిశోధనా కేంద్రాలు డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. ఇక విద్యార్థులకు అవసరమైన క్రీడా ప్రాంగణాలు, క్యాంపస్ సుందరీకరణ పనులకు కూడా ఈ నిధులు వెచ్చించనున్నారు. ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయంపై విద్యార్థులు, అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# నగర ఉద్యోగులకు... తీపి కబురు..

**50 శాతం వరకు హెచ్ఆర్ఏ మినహాయింపు ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర సర్కారు**

హైదరాబాద్,మార్చి20(మనం న్యూస్): తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఉద్యోగం చేసేవారికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది.ఇంటి అద్దె భత్యం 50 శాతం వరకు(హెచ్ఆర్ఏ) మినహాయింపు ఇచ్చింది. .ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపోతే ఇప్పటి వరకు ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై నగరాలను మాత్రమే మెట్రో నగరాలుగా పరిగణించేవారు. దీంతో ఆయా నగరాల్లో హెచ్ఆర్ఏ మినహాయింపు పరిమితి 50 శాతంగా ఉంటోంది. తాజాగా ఈ జాబితాలోకి హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, పుణే, అహ్మదాబాద్ చేరాయి. ఈ క్రమంలో ఈ నగరాలలో నివాసాం ఉండే ఉద్యోగుల ఇంటి అద్దె భత్యం మినహాయింపును 50 శాతానికి పెంచింది. అయితే ఈ 50 శాతం హెచ్ఆర్ఏ మినహాయింపు ప్రయోజనం కేవలం పాత పన్ను విధానాన్ని ఎంచుకున్న వారికి మాత్రమే వర్తిస్తుందని గెజిట్‌లో కేంద్రం స్పష్టం చేసింది.

**50 శాతం వరకు హెచ్ఆర్ఏ మినహాయింపు:**

ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఆదాయపు చట్టం ప్రకారం హైదరాబాద్‌లో నివసించే ఉద్యోగుల ఇంటి అద్దెభత్యం 50 శాతం మినహాయింపు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం ప్రకారం హైదరాబాద్, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్ నగరాలను మెట్రో నగరాల జాబితాలోకి



చేర్చింది. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసించే లక్షలాది మంది సాఫ్ట్‌వేర్, ఇతర రంగాల ఉద్యోగులకు భారీ ఊరట లభించనుంది. గతంలో కేవలం ముంబయి, దిల్లీ, కోల్‌కతా, చెన్నైలను మాత్రమే మెట్రోలుగా పరిగణించి, అక్కడ ఉండేవారికి ఇంటి అద్దె భత్యం మినహాయింపును 50 శాతంగా ఇచ్చేవారు.తాజాగా ఆ వాటి జాబితాలోకి హైదరాబాద్ కూడా వచ్చి చేరింది. దీంతో హైదరాబాద్‌లో నివశించే ఉద్యోగులు తమ ప్రాథమిక జీతం లో 50 శాతం వరకు హెచ్ఆర్ఏ కింద పన్ను మినహాయింపు పొందనున్నారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి రాబోయే కొత్త ఆదాయపు పన్ను నిబంధనలను నోటిఫై చేస్తూ గెజిట్ విడుదల చేసింది.2027 జూలైలో ఫైల్ చేయబోయే రిటర్నుల సమయంలో ఇది వర్తిస్తుంది.

**నికర ఆదాయం పెరిగే అవకాశం:**

హైదరాబాద్ వంటి మహానగరాల్లో గత ఐదేళ్లుగా ఇంటి అద్దెలు విపరీతంగా పెరిగాయి. పాత నిబంధన ప్రకారం 40 శాతం పరిమితి ఉండటం వల్ల ఉద్యోగులు తాము చెల్లిస్తున్న పూర్తి అద్దెకు మినహాయింపు పొందలేకపోయేవారు. అయితే కేంద్ర ప్రభుత్వం తాజాగా ఈ పరిమితిని 40 నుంచి 50 శాతానికి పెంచడం వల్ల ట్యాక్స్ సేవింగ్స్ పెరిగి ఉద్యోగులకు చేతికి వచ్చే నికర ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

**భారత్ ఫ్యూచర్ సిటీ:**

హైదరాబాద్ గొప్ప చారిత్రక నగరంగా ప్రపంచ వ్యాప్త గుర్తింపు కలిగి ఉంది. ఆనాటి కుతుబ్ షాహీల నుండి, నిజాం పాలకుల వరకు.. ఆధునిక కాలంలో హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్, శంషాబాద్ విమానాశ్రయం వంటి అద్భుతాలతో ఈ నగరం నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంది. సీఎం రేవంత్ రెడ్డి దార్శనిక నాయకత్వంలో తెలంగాణ మరో చారిత్రాత్మక అడుగు వేస్తోంది. అదే 30 వేల ఎకరాలలో ఏర్పాటు చేసే 'భారత్ ఫ్యూచర్ సిటీ'. రేడియల్ రోడ్ల నిర్మాణం, ఫ్యూచర్ సిటీని నేరుగాఆంధ్రప్రదేశ్ లోని మచిలీపట్నం పోర్టుకు అనుసంధానించే గ్రీన్ఫీల్ జాతీయ రహదారి, భూగర్భ విద్యుత్ వ్యవస్థ, పర్యావరణ అనుకూల స్మార్ట్ గ్రిడ్లతో ఈ నగరం సుస్థిర అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని తయారు చేయడం కోసం ఇక్కడ స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటుచేశాం.ఈ ఫ్యూచర్ సిటీ నిర్మాణం పూర్తి చేసుకుంటే, ఈ నగరం అంతర్జాతీయ నగరాల సరసన నిలిచి, అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మారుతుంది.

# నిలిచిపోయిన.. మెట్రో

**తీవ్ర ఇబ్బందుల్లో ప్రయాణికులు**
**కష్టతరంగా మారిన ప్రయాణం**
**అసహనం వ్యక్తం చేసిన ప్రయాణికులు**



హైదరాబాద్, మార్చి20(మనం న్యూస్): నిత్యం వేలాది మందిని గమ్యస్థానాలకు చేర్చే హైదరాబాద్ మెట్రో రైలు సేవల్లో శుక్రవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా నగరంలో అత్యంత రద్దీగా ఉండే నాగోల్ - రాయదుర్గం మార్గంలో సాంకేతిక లోపం తలెత్తడంతో రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ఆఫీసులకు, కళాశాలలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**రద్ది సమయంలో:**

శుక్రవారం ఉదయం రద్దీ సమయంలో నాగోల్ నుండి రాయదుర్గం వెళ్లే మార్గంలో ఒక్కసారిగా మెట్రో రైళ్లు నిలిచిపోయాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సిగ్నలింగ్ వ్యవస్థ,విద్యుత్ సరఫరాలో తలెత్తిన సాంకేతిక సమస్యే దీనికి ప్రధాన కారణమని అధికారులు వెల్లడించారు. రైళ్లు స్టేషన్ల మధ్యలో, పట్టాలపైనే నిలిచిపోవడంతో లోపల ఉన్న ప్రయాణికులు ఉక్కపోతతో, ఆందోళనతో గడిపారు.రైళ్లు కదలకపోవడంతో ప్రయాణికులు మెట్రో కోచ్‌లలోనే సుమారు 30 నిమిషాల పాటు చిక్కుకుపోయారు. సోషల్ మీడియా వేదికగా పలువురు ప్రయాణికులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. రైల్వే స్టేషన్లలో కూడా రద్దీ విపరీతంగా పెరిగిపోయి, ప్రయాణికుల మధ్య తోపులాట వంటి దృశ్యాలు కనిపించాయి. ముఖ్యంగా అమీర్పేట్, ప్రకాష్ నగర్, హైటెక్ సిటీ స్టేషన్లలో రద్దీని నియంత్రించడం సిబ్బందికి కష్టతరంగా మారింది.

**యుద్ధ ప్రతిపదికన:**

సమాచారం తెలుసుకున్న మెట్రో సాంకేతిక బృందం యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగి మరమ్మతులు చేపట్టింది. సుమారు 30 నిమిషాల కృషి తర్వాత సాంకేతిక లోపాన్ని సరిదిద్దారు. అనంతరం మెట్రో రైలు సేవలు తిరిగి ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం సర్వీసులు యధావిధిగా నడుస్తున్నాయని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రయాణికులకు కలిగిన అంతరాయానికి సంస్థ విచారం వ్యక్తం చేసింది.

# ఓయూలో బడ్జెట్ ప్రతుల దహనం

## విద్యారంగానికి అన్యాయం చేశారంటూ ఏబీవీపీ నిరసన

సికింద్రాబాద్, మార్చి 20 (మనం న్యూస్) రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆరట్స్ కళాశాల వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు మాట్లాడుతూ, 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3,24,234 కోట్ల బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 8 శాతం నిధులు మాత్రమే కేటాయించడం తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. కీలకమైన విద్యకు కనీసం 10 శాతం నిధులు కూడా కేటాయించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పేద విద్యార్థులకు కీలకమైన ఫీజు రీయింబర్స్మెంట్ పథకం బకాయిల విడుదలపై బడ్జెట్లో ఎలాంటి స్పష్టత లేకపోవడం ఆందోళనకరమన్నారు. ఈ పథకాన్ని ఎత్తివేస్తారా అన్న అనుమానాలు వ్యక్తం చేశారన్నారు. ఉస్మానియా, చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయాలకు నిధుల కేటాయింపులను స్వాగతిస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లోని ఇతర యూనివర్సిటీలను విస్మరించడం అన్యాయమన్నారు. యూనివర్సిటీలలో ఖాళీల భర్తీపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం వల్ల విద్యా వ్యవస్థను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాల హామీలపై బడ్జెట్లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. బడ్జెట్ సమావేశాలు ముగిసేలోపే ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని, యూనివర్సిటీలలో ఖాళీలను భర్తీ చేయాలని, అన్ని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నియామక ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి, నిరుద్యోగ వర్గాలు ప్రభుత్వంపై ఆందోళనలను మరింత ఉధృతం చేస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జీవన్, హైదరాబాద్ సిటీ కార్యదర్శి పృధ్వీతేజ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అలివేలి రాజు, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరిప్రసాద్, ఓయూ కార్యదర్శి మోక్షిత్తో పాటు విజయ్ సింగ్, మోహన్ బాబు, తన్మై, శివ, వంశి తదితరులు పాల్గొన్నారు.











## పకడ్బందీగా... జనగణన

**క్షేత్రస్థాయిలో జనాభా**

**బల్దియా అదనపు కమిషనర్ చంద్రకళ**

హైదరాబాద్,మార్చి20(మనం న్యూస్): జనగణన ను నగరంలో పకడ్బందిగా నిర్వహించాలని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ చంద్రకళ బల్దియా అధికారులకు అదేశాలు జారీ చేశారు. శుక్రవారం జీహెచ్ఎంసీ కార్యలయంలో జీహెచ్ఎంసీ పరిధిలోనీ సెన్సెస్ -2027 సర్వే పై 60 సర్కిల్ ల పరిధిలోని ఛార్జీ క్లర్క్ లుగా నియామకమైన జూనియర్ అసిస్టెంట్ లు , సీనియర్ అసిస్టెంట్ లు , పర్యవేక్షకుల కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ జనాభా గణన-2027 లో భాగంగా ఏ ఒక్కరినీ వదలకుండా, ఎలాంటి తేడాలు లేకుండా చూడాలని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ చంద్రకళ అన్నారు. క్షేత్రస్థాయిలో జనాభా ఉన్నది ఉన్నట్టు గా నమోదు చేయాలని అమే అధికారులకు సూచించారు. జనగణన-2027 సర్వే రెండు దశల్లో జరుగుతుందని,మొదటి దశలో ఇళ్ల జాబితా సేకరణ,గృహ గణన,అలాగే రెండో దశలో జనాభా గణన ఉంటుందన్నారు. మొదటి దశ పగడ్బందీగా నిర్వహిస్తే రెండో విడత సజావుగా జరుగుతుందని అమే అధికారులకు వెల్లడించారు. జనాభా గణన-2027 నియమ, నిబంధనల పై పూర్తి అవగాహన పెంపొందించుకొని సెన్సెస్ -2027 పక్కగా జరిగేలా చూడాలన్నారు కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 25వ తేదీన ఇందిరా పార్కు వద్ద వికలాంగుల రిలే నిరాహార దీక్షలు

సికింద్రాబాద్, మార్చి 20 (మనం న్యూస్) వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25వ తేదీన ఇందిరా పార్కు వద్ద వికలాంగుల రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అమలు సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు నిరాహార దీక్షకు సంబంధించిన గోడపత్రికను ఓయూలోని ఆరట్స్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో వికలాంగులకు మేనిఫెస్టోలో ఎన్నో హామీలు ఇచ్చి విస్మరించిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపల అన్ని హామీలు నెరవేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ వికలాంగుల హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా కూడా వికలాంగుల పెన్షన్ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెరుకు నాగభూషణం, ముదిగొండ నరసింహ, చంద్రశేఖర్ యాదవ్, వేణు వంశరాజ్, రామచందర్ లాల్ సింగ్, లెప్రసి రమేష్, మరుగుజ్జు మల్లేష్, సైదులు, వికలాంగుల ఐక్య సంఘాలు తదితరులు పాల్గొన్నారు.



## బస్టాండ్లో చలివేంద్రం ప్రారంభం




చేవెళ్ల, మార్చి 20 (మనం న్యూస్): వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం చేవెళ్ల బస్టాండ్ ఆవరణలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ కేంద్రం ద్వారా బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులకు, పాదచారులకు చల్లని తాగునీరు అందిస్తున్నారు. సేవా దృక్పథంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సమితి సభ్యులను స్థానికులు అభినందించారు.

## చేవేళ్లలో భూ ప్రకంపనలు.. భయంతో జనం పరుగులు

చేవెళ్ల, మార్చి 20(మనం న్యూస్): చేవేళ్ల పట్టణం, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఒక్కసారిగా భూమి కంపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భారీ శబ్ధంతో కూడిన ఈ ప్రకంపనల ధాటికి ప్రజలు ఏం జరుగుతుందో అని భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. శుక్రవారం ఉదయం 9:30 గంటల సమయంలో అకస్మాత్తుగా గట్టిగా శబ్ధం వినిపించిందని, కొన్ని క్షణాల పాటు భూమి స్వల్పంగా కంపించినట్లు అనిపించిందని స్థానికులు చెబుతున్నారు. భూ ప్రకంపనల ధాటికి ఇంట్లో వస్తువులు కదలడం, పాత్రలు శబ్ధం చేయడంతో ప్రజలు ఆందోళనతో వీధుల్లోకి వచ్చారు. మరోవైపు ఈ ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు ఆరా తీస్తున్నారు. ఇది భూకంపమా లేక సమీపంలోని క్వారీల్లో జరిగిన పేలుళ్ల వల్ల వచ్చిన ప్రకంపనలా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు..

## హనుమాన్ ఆలయానికి 190 గజాల భూమి విరాళం

చేవెళ్ల, మార్చి 20 (మనం న్యూస్): మున్సిపల్ పరిధిలోని మల్కాపూర్ హనుమాన్ దేవాలయ అభివృద్ధికి పలువురు దాతలు ఉదారత చాటుకున్నారు. ఆలయ సమీపంలోని తమ సొంత స్థలాన్ని భక్తిభావంతో విరాళంగా అందజేశారు. బక్కారెడ్డి మాణిక్య రెడ్డి (100 గజాలు), శేరిపాల నర్సింహారెడ్డి, శేరి అడవి రెడ్డి నరసింహారెడ్డి, శేరి ఎడ్డి సత్తి రెడ్డి తలా 30 గజాల చొప్పున మొత్తం 190 గజాల భూమిని ఆలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా దాతలకు దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





# ఓయూ అభివృద్ధికి 1000 కోట్లు

**సీఎం రేవంత్ రెడ్డికి విద్యార్థుల కృతజ్ఞతలు**

సికింద్రాబాద్, మార్చి 20 (మనం న్యూస్) రాష్ట్ర బడ్జెట్లో ఉస్మానియా యూనివర్సిటీ సమగ్ర అభివృద్ధికి రూ.1000 కోట్ల నిధులను కేటాయించినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో విద్యార్థులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. నరసింహ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఓయూకు సీఎం రేవంత్ రెడ్డి బడ్జెట్ లో భారీగా నిధులు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. విద్యార్థుల చిరకాల వాంఛ అయిన నూతన హాస్టల్ భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల మెరుగుదల, పరిశోధనలకు అవసరమైన వనరుల అభివృద్ధికి ఈ నిధులు కీలకంగా మారనున్నాయని తెలిపారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల బలోపేతానికి సీఎం చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.

అనంతరం విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సీఎం మరియు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివయాదవ్, నందు, పార్థు, నవీన్ గౌడ్, గోపి గౌడ్, ప్రశాంత్, బస్వంత్, శివ, నవీన్, సాయి, ఆదిత్య తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# డయాలసిస్ రోగులకు ఇబ్బందులు కలగకూడదు

**– బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి**

చేవెళ్ల, మార్చి 20 (మనం న్యూస్): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకునే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన



ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాన్ని పక్కనే ఉన్న పాలియేటివ్ కేంద్రంలోకి మార్చాలని సూచించారు. దీనిపై వైద్యులు స్పందిస్తూ.. ఉన్నతాధికారుల అనుమతి రాగానే కేంద్రాన్ని మారుస్తామని, అంతవరకు రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ వేదికగా అంతర్జాతీయ మహిళా సదస్సు

**మార్చి 24 నుంచి 26 వరకు ఠాగూర్ ఆడిటోరియంలో సదస్సు...**




సికింద్రాబాద్, మార్చి 20 (మనం న్యూస్) 108 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం మరో అరుదైన కార్యక్రమానికి వేదిక కానుందని యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. విశ్వవిద్యాలయ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా మహిళా సాధికారత, నాయకత్వం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా 'ఓయూ ఇంటర్నేషనల్ విమెన్స్ కాన్ఫరెన్స్-2026 (ఓయూ ఐడబ్ల్యుసి-2026)'ను ఈ నెల 24 నుంచి 26 వరకు ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కుమార్ మొలుగరం తెలిపారు. ఈ మేరకు ఓయూలోని గెస్ట్ హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గివ్ టు గెయిన్: మహిళా శక్తి - సుస్థిరత అనే ఇతివృత్తంతో నిర్వహించే ఈ సదస్సు ద్వారా విద్యార్థులను సమాజానికి దిశానిర్దేశం చేసే నాయకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ఐక్యరాజ్యసమితి సూచించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా విద్యా సిద్ధాంతాలను ఆచరణలోకి తీసుకురావడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి సుమారు 1,200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. వీరిలో 500 మంది అధ్యాపకులు, 700 మంది విద్యార్థులు పాల్గొంటారు. సైన్స్, టెక్నాలజీ, సోషల్ సైన్సెస్, మేనేజ్మెంట్, మెడిసిన్ తదితర విభాగాలకు చెందిన సుమారు 250 పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. గౌరవ అతిథులుగా మాజీ ఆర్మీ అధికారి కెప్టెన్ మీరా దేవ్, ఉన్నత విద్యా మండలి ప్రతినిధులు పాల్గొననున్నారు. ప్రధాన వక్తలుగా పద్మశ్రీ అవార్డు గ్రహీతలు డాక్టర్ మంజుల అనగాని, డాక్టర్ రఘురాం, న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నంద, నటి-రాజకీయ నాయకురాలు గౌతమి తడిమల్ల ప్రసంగించనున్నారు. ముగింపు కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి దేవసేన, జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్పర్సన్ విజయభారతి సయాని తదితరులు పాల్గొంటారు. ఈ సందర్భంగా రాష్ట్ర బడ్జెట్లో ఓయూ అభివృద్ధికి రూ.1,000 కోట్ల కేటాయింపుపై ఉపకులపతి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత విద్యాభివృద్ధిపై చూపుతున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ నిధులతో విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులు మెరుగుపడతాయని తెలిపారు. ఓయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, అంతర్జాతీయ మహిళా సదస్సు సారథి ప్రొఫెసర్ విజ్జులత మాట్లాడుతూ 108 ఏళ్ల ఓయూ చరిత్రలో ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టినందుకు విసి కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు. మహలకా చందా భాయి మహిళా విభాగం, ఇతర సంస్థల సహకారాన్ని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ ఎస్. జితేంద్ర కుమార్ నాయక్, ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, ఫ్యాకల్టీ ల డీన్లు, విభాగాల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మత పెద్దలతో
# శాంతి కమిటీ సమావేశం

(తలకొండపల్లి మార్చ్20/మనం న్యూస్): రంజాన్ పండుగ సందర్భంగా తలకొండపల్లి పోలీస్ స్టేషన్లో శాంతి కమిటీ సమావేశం ఎస్సై కె.శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలో మత సామరస్యం చాలా ముఖ్యమని, మతపరమైన సమస్యలు తలెత్తకుండా ప్రతి పండుగను అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ పండుగను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పుకార్లు, వదంతులు, వివాదాలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.అలాగే, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, మతపరమైన నకిలీ వార్తలను సృష్టించడం లేదా మతపరమైన వార్తలను ఫార్వార్డ్ చేయడం వంటి చర్యలను పోలీసులు ఖచ్చితంగా పర్యవేక్షిస్తున్నారని ఎస్సై కె.శేఖర్ చెప్పారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ విష్ణువర్ధన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ హిమవంత రావు, ముస్లిం మతపెద్దలు వివిధ మతాలకు చెందిన మత పెద్దలు, యువకులు,తదితరులు పాల్గొన్నారు.







# టికెట్ తనిఖీలో రికార్డు ఆదాయం సాధించిన దక్షిణ మధ్య రైల్వే

**రూ. 223.60 కోట్ల ఆదాయం – లక్ష్యాన్ని 14 రోజుల ముందే అధిగమింపు..**



సికింద్రాబాద్, మార్చి 20 (మనం న్యూస్) దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో టికెట్ తనిఖీ ప్రక్రియ ద్వారా రూ. 223.60 కోట్ల రికార్డు స్థాయి ఆదాయాన్ని నమోదు చేసి మరో కీలక మైలురాయిని సాధించింది. రైల్వే బోర్డు నిర్దేశించిన రూ. 221.08 కోట్ల లక్ష్యాన్ని సంవత్సరం ముగియడానికి 14 రోజుల ముందుగానే ఈ జోన్ అధిగమించడం విశేషం. ఏ ఆర్థిక సంవత్సరంలోనైనా టికెట్ తనిఖీ ద్వారా ఈ స్థాయి ఆదాయం నమోదు కావడం ఇదే మొదటిసారి. ఇంతకుముందు 2023-24 ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 220.81 కోట్ల ఆదాయాన్ని ఈసారి అధిగమించింది. టికెట్ లేని ప్రయాణం, ముందస్తుగా బుక్ చేయని లగేజీ వంటి ఉల్లంఘనలపై నమోదైన కేసుల ద్వారా ఈ ఆదాయం సాధ్యమైంది. ముఖ్యంగా 2025 అక్టోబర్ 18న ఒక్క రోజులోనే రూ. 1.85 కోట్ల ఆదాయం నమోదవడం మరో ప్రత్యేకతగా నిలిచింది. టికెట్ తనిఖీ వ్యవస్థ రైల్వేల్లో క్రమరహిత ప్రయాణాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తోంది. టికెట్ లేకుండా ప్రయాణించే వారిని నిరోధించడం ద్వారా బుకింగ్ విండోల వద్ద టిక్కెట్ల అమ్మకాలు పెరగడానికి ఇది దోహదపడుతోంది. ప్రయాణికుల్లో సరైన టిక్కెట్ కలిగి ఉండాల్సిన అవసరంపై అవగాహన పెంచడంలో కూడా ఇది ముఖ్య పాత్ర పోషిస్తోంది. ప్రయాణికుల సౌకర్యాన్ని మెరుగుపరచడానికి రైల్వే శాఖ పలు డిజిటల్ కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. వీటిలో రైల్ వన్ యాప్, ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్లు (ఏ టి వి ఎం), స్టేషన్లలో క్యూ ఆర్ కోడ్ల ప్రదర్శన వంటి చర్యలు ఉన్నాయి. ఈ సౌకర్యాలు టిక్కెట్ల కొనుగోలును సులభతరం చేయడంతో పాటు ఆదాయం పెరగడానికి తోడ్పడుతున్నాయి. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వాణిజ్య విభాగం అధికారులు, సిబ్బందిని అభినందించారు. టికెట్ తనిఖీ వ్యవస్థ క్రమశిక్షణను పెంపొందించడంలోనే కాకుండా, నిజాయితీగా ప్రయాణించే ప్రయాణికుల్లో విశ్వాసాన్ని బలపరచడంలో కూడా కీలకంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.






# విద్యారంగానికి 15% బడ్జెట్ కేటాయించాలని నిరసన

సికింద్రాబాద్, మార్చి 20 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీలోని ఆరట్స్ కళాశాల వద్ద బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు ప్లకార్డులు, ఖాళీ కాలేజ్ బ్యాగులతో వినూత్న నిరసన చేపట్టారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ ఆధ్వర్యంలో ఆరట్స్ కాలేజీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యారంగానికి బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాగారం ప్రశాంత్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో విద్యారంగానికి 15% నిధులు, విద్య భరోసా కార్డు కింద రూ.5 లక్షలు, విద్యార్థులకు స్కూటీలు అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు కాలేదని విమర్శించారు. ప్రస్తుతం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సుమారు రూ.10,000 కోట్ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ బడ్జెట్లో విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో విద్యార్థులు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏల్పుకొండ రామకృష్ణ, మేడి పవన్ దేవాన్ష్, సింగి రెడ్డి ప్రశాంత్ రెడ్డి, నిఖిల్, వేణు, భాను, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ జేఏసి చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

సికింద్రాబాద్, మార్చి 20 (మనం న్యూస్) రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి 26, 674 వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించడం పట్ల ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆరట్స్ కళాశాల వద్ద కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ ఉస్మానియా యూనివర్సిటీకి 1000 కోట్లు, వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి 400 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఈరోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖకు 26, 674 వేల కోట్లు రూపాయలను కేటాయించడం గొప్ప విషయం అన్నారు. అదేవిధంగా డిసెంబర్ లో రేవంత్ రెడ్డి ఓయూలో పర్యటించిన సందర్భంగా ఆరట్స్ కళాశాల వద్ద నిర్వహించిన సభలో చెప్పిన విధంగా ఉస్మానియా యూనివర్సిటీకి 1000 కోట్లు కేటాయించడం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు.

ఈ నిర్ణయం రాష్ట్ర ఉన్నత విద్యాభివృద్ధికి కీలకంగా మారుతుందని విశ్వవిద్యాలయ మౌలిక వసతుల అభివృద్ధి, పరిశోధనలకు తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఓయూ జేఏసీ తరఫున సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, అడ్లూరి లక్ష్మణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఓయూ జెఏసి నాయకులు చందు, రాజేందర్, రాజు, ప్రవీణ్, చరణ్, అరుణ్, స్వామి, శ్రీనివాస్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.





# పార్క్ చేసి ఉన్న కారులో అకస్మాత్తుగా మంటలు

**పరేడ్ గ్రౌండ్ వద్ద ఘటన – పూర్తిగా దగ్ధమైన వాహనం..**

సికింద్రాబాద్, మార్చి 20 (మనం న్యూస్) సికింద్రాబాద్లోని పరేడ్ గ్రౌండ్ వద్ద పార్క్ చేసి ఉంచిన ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం ప్రకారం.. పరేడ్ గ్రౌండ్ వద్ద పార్క్ చేసి ఉన్న కారులో ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తమయ్యారు. వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోపే మంటలు తీవ్రరూపం దాల్చి కారు పూర్తిగా దగ్ధమైంది. అనంతరం ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. అయితే కారులో మంటలు ఎలా చెలరేగాయన్న దానిపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.